# ఏఐ అమలుకు ప్రత్యేక ప్రణాళిక


మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

కమాన్‌చౌరస్తా, జూన్ 8 : అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో తరగతి గదిలో కృత్రిమ మేధ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, నేటి విద్యావిధానంలో కృత్రిమ మేధకు ప్రత్యేకమైన స్థానం ఉన్నదని, ప్రతి ఉపాధ్యాయుడు దానిపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ క్రమంలో సీబీఎస్ఈ నిపుణులైన బీ రవి కిరణ్, చారు దింగ్రతో కలిసి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో కృతిమ మేధ అమలుపరిచేందుకుపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు పేర్కొన్నారు. అవగాహన సదస్సులో భాగంగా ఉపాధ్యాయులు ప్రదర్శించిన పలు చిత్రమాలికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్మీ జవాన్‌ను అభినందించిన కేంద్రమంత్రి


కరీంనగర్‌లో ఆర్మీ జవాన్ యాసర్ల రాజును అభినందిస్తున్న బండి సంజయ్


హుజూరాబాద్ రూరల్: కనుకులగిద్దలో గ్రామస్తులతో జవాన్

వీణవంక, జూన్ 8: దేశాయిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ యాసర్ల రాజు ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో దేశ రక్షణకు పోరాటం చేసినందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. ఆదివారం కరీంనగర్‌లో ఆర్మీ జవాన్‌కు శాలువాకప్పి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు ఉన్నారు.

***జవాన్‌కు గ్రామస్తుల ఘన సన్మానం***

హుజూరాబాద్ రూరల్, జూన్ 8: హుజూరాబాద్ మండలం కనుకులగిద్ద గ్రామానికి చెందిన జవాన్ రామారపు తిరుపతి ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో పాలుపంచుకుని ఆదివారం క్షేమంగా గ్రామానికి చేరుకోగా, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవోజు నరేందర్, ములుగు సాంబరాజు, కే.రాజు, ములుగు సురేందర్, ఎం.చింటూ ఎం. నితీశ్, ఎం. చందు తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు వైద్యం.. సమస్యలమయం

- హుజూరాబాద్ దవాఖానలో వైద్యుల కొరత
- తగ్గిన ఓపీ, సర్జరీ సేవలు
- ఇబ్బందులు పడుతున్న రోగులు


హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్

హుజూరాబాద్ టౌన్, జూన్ 8: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సకల సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించిన హుజూరాబాద్ దవాఖానలో నేడు సమస్యలు ముసురుకున్నాయి. ముఖ్యంగా వైద్యుల కొరత, కొన్ని విభాగాల్లో పరికరాలు అవసరమైన లేకపోవడంతో రోగులకు నాణ్యమైన వైద్యం అందని పరిస్థితులు నెలకొన్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం హుజూరాబాద్‌లోని 30 పడకల దవాఖానను వంద పడకలకు అప్ గ్రేడ్ చేసి అందుకు తగినట్టుగా సౌకర్యాలు కల్పించింది. గతంలో ఆరుగురు ప్రత్యేక స్త్రీ వైద్య నిపుణులు, ఇద్దరు ఎముకల వైద్యులు, ఒక జనరల్ ఫిజీషియన్, ఐదుగురు మత్తు వైద్యులు, నలుగురు పిల్లల వైద్యులు, చెవి, ముక్కు గొంతు డాక్టర్, దంత డాక్టర్, సర్జన్, ఒక ఆయుష్, ఇద్దరు రేడియాలజిస్టులు, ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యుల చొప్పున మొత్తం 26 మంది విధులు నిర్వర్తించేవారు. అయితే, కొన్ని నెలల కింద ఆరుగురు వైద్యులను బదిలీ చేసి వారిస్థానంలో ముగ్గురినే నియమించారు. ఇటీవల ఓ ఇద్దరు వైద్యులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మత్తు వైద్యులు ఇద్దరు, జనరల్ సర్జన్లు ఇద్దరు, ఎముకల విభాగంలో ఇద్దరు, చెవి ముక్కు గొంతు డాక్టర్, ఓ రేడియాలజిస్టు అవసరముండగా.. దంత విభాగంలో వైద్యులు ఉన్నా పరికరాలు లేకపోవడంతో రోగులకు వైద్య సేవలు దూరమవుతున్నాయి.

***తగ్గిన ఓపీ, ఆపరేషన్లు***

వైద్యులు లేకపోవడంతో ఓపీ, సర్జరీలు తగ్గాయి. గతంలో ఆరుగురు ప్రత్యేక స్త్రీల వైద్య నిపుణులు ఉండగా ప్రస్తుతం ఐదుగురు ఉన్నారు. అందులో ఒకరు సస్పెండ్ అవగా, ఇప్పుడు నలుగురే సేవలందిస్తున్నారు. అందులోనూ ఇద్దరు పర్మినెంట్ వైద్యులు ఉండగా, ఇద్దరు డిప్యూటేషన్‌పై ఇక్కడ సేవలందిస్తున్నారు. జనరల్ సివిల్ సర్జన్, ఆర్థోపెడిక్, ఈఎంటీ, వైద్యులు అందరూ బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఎవరూ రాకపోవడంతో రోగులు సేవలందక ప్రైవేటు దవాఖానలను ఆశ్రయిస్తున్నారు. మత్తు వైద్యుడు ఒక్కరు మాత్రమే ఉన్నారు. కాగా, ఎక్స్‌రే, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్లకు, నర్సులకు కొరతే ఉంది. ల్యాప్రోస్కోపిక్ పరికరాలు, సీటీ స్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలు సైతం అందుబాటులో లేవు. జిల్లా మంత్రి, వైద్యారోగ్య శాఖ మంత్రి స్పందించి హుజూరాబాద్ ప్రాంతీయ దవాఖానకు తగినంత వైద్యులను నియమించి రోగులకు వైద్యసేవలందించాలని కోరుతున్నారు.

**సకాలంలో వైద్యం అందిస్తాం**



రోగులకు సకాలంలో వైద్యం అందిస్తాం. సిబ్బంది రోగులను ఇబ్బందులకు గురిచేస్తే నా దృష్టికి తీసుకువస్తే తప్పక చర్యలు తీసుకుంటా. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు సాయశక్తులా కృషి చేస్తా.

**-డాక్టర్ నల్లా నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్**

# అనాథ ఆడబిడ్డ పెళ్లికి హాజరైన మాజీ ఎమ్మెల్యే


వధూవరులతో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దీవెన దంపతులు

చొప్పదండి, జూన్ 8 : మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన అనాథ ఆడబిడ్డ మమత పెళ్లికి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దీవెన దంపతులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన ఎమ్మెల్యేగా కొనసాగుతున్న సమయంలో మమత, సమత తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందగా, నాటి నుంచి సుంకె రవిశంకర్ కన్నతండ్రిలా వారికి అన్ని విధాలా అండగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మమత పెళ్లి కుదరడంతో శనివారం నూతన వస్త్రాలు, బంగారు ఉంగరాన్ని కానుకగా పంపించారు. ఆదివారం పెళ్లిలో వధూవరులను ఆశీర్వదించి, ఆనంద భాష్పాలు రాల్చడంతో పెళ్లికి వచ్చిన వారంతా కన్నీటిపర్యంతమయ్యారు.

## మాగంటి మృతికి సంతాపం

కలెక్టరేట్, జూన్ 8: బీఆర్ఎస్ పార్టీకి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అనారోగ్యంతో మృతి చెందడంపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో మాగంటి అభిమాన సంఘం ఆధ్వర్యంలో సంతాప సమావేశం నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ఓబులేషు, ఏసురత్నం, శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆయన మృతి తీరని లోటని అన్నారు. ప్రాంతాలకతీతంగా పేదల పక్షాన పోరాడిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వేల మందికి సాయం చేసి, వారికి బతుకుదెరువు కల్పించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రాజు, మున్నా, మహీదర్‌తో పాటు కొబ్బరి బొండాల విక్రయ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన నియామకం

తిమ్మాపూర్, జూన్ 8: మండలంలోని నుస్తులాపూర్ గ్రామ శ్రీసాయి పురుషుల పొదుపు సంఘం నూతన అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన కొంటు రవీందర్ నియామకమయ్యారు. ఆదివారం 26వ వార్షిక మహాసభలో సమితి అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, పాలకవర్గం పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికల్లో అధిక ఓట్లు సాధించి కొంటు రవీందర్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా మాచర్ల ఎల్లయ్యగౌడ్, నూతన పాలకవర్గ సభ్యులుగా గుండోజు బాలరాజు, దేవసాని సంపత్, నల్ల సుధాకర్, కెమ్మసారపు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొంటు రవీందర్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## పురుషుల పొదుపు సమావేశం

శంకరపట్నం, జూన్ 8: మండలంలోని పురుషుల పొదుపు సమితి 23వ వార్షిక సమావేశం ఆదివారం గొల్లపల్లి శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. సమావేశంలో తొమ్మిది గ్రామాల పురుషుల పొదుపు సంఘాల వార్షిక లావాదేవీల నివేదికను గణకుడు ఆంజనేయులు చదివి వినిపించారు. అనంతరం ఎన్నికల్లో మరోసారి పొదుపు సమితి అధ్యక్షుడిగా వంగల రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నరహరి రాజిరెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిమ్మాపూర్, జూన్ 8: మండలంలోని మోయతుమ్మెద వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎల్ఎండీ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి పర్లపల్లి వైపు వెళ్తుండగా.. నల్లగొండ శివారులో పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ మంద శేఖర్, ట్రాక్టర్ ఓనర్ బోయిని చంద్రయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం, జూన్ 8: మండలంలోని కేశవపట్నం గ్రామ శివారులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనగా, బైక్‌పై ప్రయాణిస్తున్న రాజాపూర్ గ్రామానికి చెందిన మాతంగి ప్రభాకర్ ఎడమ కాలికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికుల సమాచారంతో 108 వాహనం సిబ్బంది వచ్చి క్షతగాత్రుడిని హుజూరాబాద్ దవాఖానకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. బైక్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్

కొత్తపల్లి, జూన్ 8: మండలంలోని కమాన్‌పూర్, కొత్తపల్లి హవేలి రైతు వేదికల్లో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంపన్న రైతు దేశానికి గర్వ కారణం అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి రైతులకు నేరుగా శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల రైతులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి సముచితం కాదు

కలెక్టరేట్, జూన్ 8: ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సముచితంగా లేదని, తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మోసం అంజయ్య, దామెర మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఆసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే ఒకటి మాత్రమే విడుదల చేస్తామని చెప్పడం ఏమేరకు సమంజమని ప్రశ్నించారు. మరో డీఏ తర్వాత విడుదల చేస్తామంటూ ప్రకటించడం ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగుల పట్ల వివక్ష చూపడమేనని స్పష్టమవుతున్నదన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పక్షం రోజుల్లో విడుదల చేస్తామని చెప్పి, ఏడాదిన్నర గడుస్తున్నా ఇంకా మభ్యపెడుతుండడం దారుణమని మండిపడ్డారు. కేబినేట్ సమావేశంలో పీఆర్సీ ఊసే ఎత్తకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, జూన్ 8: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఈ విద్యాసంవత్సరం నుంచి నూతనంగా ప్రారంభమవుతున్న అకౌంటింగ్ టాక్సేషన్ వొకేషనల్ కోర్సు బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ కిరణ్‌జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఇంగ్లిష్, అకౌంటింగ్, టాక్సేషన్ కోర్సుల్లో బోధించాలని.. ఆయా సబ్జెక్టుల్లో పీజీతో పాటు బీఈడీ, ఎంకాం(టాక్సేషన్) ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 11లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## ఆటోనగర్ షాపుల మధ్య పశువ్యర్థాలు

కార్పొరేషన్, జూన్ 8 : నగరంలో బక్రీద్ సందర్భంగా ఏర్పడ్డ పశు వ్యర్థాలను నగరపాలక అధికారులు ఇష్టారాజ్యంగా ఖాళీ స్థలాల్లో వేయించడం వివాదస్పదమవుతున్నది. గతంలో ఆటోనగర్‌లో ఇలాంటి పశు వ్యర్థాలను వేశారని ఫిర్యాదు రాగా, చర్యలు చేపట్టిన నగరపాలక అధికారులు ఇప్పుడు వారే ఖాళీ స్థలాల్లోనే వేయించడం ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి. నిబంధనలు పాటించాల్సిన నగరపాలక పారిశుధ్య అధికారులే ఇష్టారాజ్యంగా ఖాళీ స్థలాల్లో వేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఇలా ఖాళీ స్థలాల్లో వ్యర్థాలను వేయడం వల్ల స్థానికంగా ఉండే ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొన్నదని మాజీ కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్ తెలిపారు. గతంలో ఇలాంటి వ్యర్థాలను డంప్ యార్డు వద్ద వేసినా నిబంధనల మేరకు తగు చర్యలు చేపట్టేవారని, కానీ ఇప్పుడు అధికారులు ఖాళీ స్థలాల్లో వేయించడమేమిటని ప్రశ్నించారు. దీనిపై జిల్లా యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ ప్రకటన విడ్డూరం

కలెక్టరేట్, జూన్ 8: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే ఒకటి మాత్రమే ప్రస్తుతం విడుదల చేస్తామని, మరోటి ఆరునెలల అనంతరం మంజూరు చేస్తామంటూ పేర్కొనడం విడ్డూరంగా ఉందని, తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చందుపట్ల జనార్ధన్, గడ్డం అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఓవైపు కేంద్రం ఏటా ఆరు నెలలకోసారి జనవరి, జూలై మాసాల్లో ఎప్పటికప్పుడు డీఏలు విడుదల చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పెండింగ్‌లో ఉంచడం పెన్షనర్లు, ఉద్యోగులను తీవ్ర మనోవేదనకు గురిచేయడమేనన్నారు. దశాబ్దాల తరబడి ప్రజలకు సేవలందించిన పెన్షనర్లు, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లటంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయంతో తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారని పేర్కొన్నారు. తమ పట్ల ప్రభుత్వం వివక్ష ప్రదర్శించకుండా, ఎప్పటికప్పుడు డీఏలు విడుదల చేయాలని హితవు పలికారు. కొత్త పీఆర్సీ ప్రకటించి 2023 జూలై నుంచి అమలు చేయాలని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు.

## ఉమ్మడి జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపిక

కొత్తపల్లి, జూన్ 8 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్స్ బాయ్స్, గర్ల్స్ బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలు ఆదివారం జిల్లా కేంద్రంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించారు. ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్లకు సెలెక్ట్ చేశారు. ఎంపికైన క్రీడాకారులు జూన్ 10, 11వ తేదీల్లో నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర బాక్సింగ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనను న్నారు. ఈ ఎంపిక పోటీల్లో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, కోచ్‌లు పాల్గొన్నారు.

# ఆత్మీయ సమ్మేళనాలు


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న అల్గునూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ 1999-20 పూర్వ విద్యార్థులు


సైదాపూర్ మండలం పెర్కపల్లి పాఠశాలలో..

కమాన్‌చౌరస్తా, జూన్ 8 : అల్గునూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ 1999-20 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 25 సంవత్సరాల తర్వాత తామంతా ఒక చోట కలుసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను సన్మానించుకుని, గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, రఘుశంకర్ రెడ్డి, రాజి రెడ్డి, మునయ్య, రాజ్యలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

***పెర్కపల్లి ఉన్నత పాఠశాలలో***

సైదాపూర్, జూన్ 8: మండలంలోని పెర్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004-05 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు, తమ మిత్రులతో అనుబంధాన్ని, బడిలో చిన్ననాటి అనుభవాలను నెమరు వేసుకొన్నారు. ఉపాధ్యాయులు సత్యం, లక్ష్మణ్, సత్యనారాయణ, సుధాకర్, శాస్త్రి, శ్రీనివాస్‌కు పూర్వ విద్యార్థులు పాదపూజ చేశారు.

## జూనియర్ సివిల్ జడ్జిలకు సత్కారం


జడ్జిలను సత్కరించిన పద్మశాలీ సంఘం

హుజూరాబాద్ రూరల్, జూన్ 8: పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన మ్యాకం రమ్య, బత్తుల మానస ఇటీవల సివిల్ జడ్జిలుగా నియమితులైన సందర్భంగా మండలంలోని చెల్పూర్ పద్మశాలీ సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు మార్త రవీందర్, గుండెటి మహదేవ్, గ్రామాధ్యక్షుడు ఆడెపు సమ్మయ్య, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెండెమ్ సర్వేశ్వర్, పద్మశాలీ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి చిలుకమారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పొలంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పూజారి బస్మంగీ శంకరయ్య, రాజగోపాల్, ఉమేశ్, లింగమూర్తితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అనాథ వృద్ధుడికి అంతిమ సంస్కారం


రామడుగు, జూన్ 8 : పెద్దపల్లి శివారులో ఓ చెట్టుకింద నివాసం ఉంటున్న సిద్ధం రాములు అనే అనాథ వృద్ధుడు అనారోగ్యంతో ఉన్నాడని సమీపవాసులు రామడుగు మండలం వెలిచాల స్పందన అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకుడు మంచికట్ల శ్రీనివాస్‌కు కొన్ని రోజుల క్రితం సమాచారం అందించారు. దీంతో శ్రీనివాస్ పెద్దపల్లికి చేరుకొని అనారోగ్యంతో బాధపడుతున్న సిద్ధం రాములును కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చేర్పించి వైద్యం చేయించారు. కాగా, తొమ్మిది రోజులుగా చికిత్స పొందుతున్న రాములు శనివారం సాయంత్రం సమయంలో మృతి చెందడంతో స్పందన అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకుడు మంచికట్ల శ్రీనివాస్ కన్న కొడుకులా అంతిమ సంస్కారం నిర్వహించారు. ఇక్కడ దూలం కళ్యాణ్, రాజు, మల్లేశ్, ఆశ్రమ పెద్దలు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి


ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గందె రాధిక, ఉపాధ్యాయులు

హుజూరాబాద్ టౌన్, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గందె రాధిక పిలుపునిచ్చారు. ఆదివారం బడిబాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, అన్నిరకాల వసతులు ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు అందుతున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలి


వీణవంకలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

వీణవంక, జూన్ 8: ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి అప్పని హరీశ్‌వర్మ విమర్శించారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న రూ.6 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో 25 శాతం నిరుపేద విద్యార్థులకు విద్యనందించే విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్వీ నాయకులు వొల్లాల శ్రీకాంత్ గౌడ్, చింతల కౌశిక్, కాట్రేవుల అజయ్ పాల్గొన్నారు.

## బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

మానకొండూర్ రూరల్, జూన్ 8: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధురాలు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన తొర్రికొండ రాజవ్వ (76) నాలుగు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో గ్రామ శివారులోని ఓ రైతు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు మానకొండూర్ సీఐ సంజీవ్ తెలిపారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# 'పీఎం కిసాన్'కు మోక్షమెప్పుడో..?

- డిసెంబర్ 2018లో పథకం ప్రారంభం
- రెండోసారి దరఖాస్తుకు అవకాశం ఇవ్వని కేంద్రం
- వేల మంది రైతుల ఎదురుచూపు

హుజూరాబాద్, జూన్ 8: వ్యవసాయంలో పెట్టుబడికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మే 10, 2018న రైతుబంధు పథకాన్ని ప్రారంభించగా.. దీనినను సరించి కేంద్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు డిసెంబర్ 2018న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన చేపట్టింది. అయితే రైతుబంధు పథకానికి దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుండగా, కేంద్రం మాత్రం పథకం ప్రారంభమైన తర్వాత కేవలం ఒక్కసారి మాత్రమే అర్జీ పెట్టుకునే అవకాశమే కల్పించింది. దీంతో ఇప్పటివరకు కొత్తగా భూమి కొనుగోలు చేసిన వేల మంది రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు.

రైతుబంధు(భరోసా) పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఆగస్టు, డిసెంబర్‌లో కొత్తగా పట్టాదారు పాసుబుక్కులను పొందిన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇస్తుండగా, కేంద్ర ప్రభుత్వం మాత్రం పథకం ప్రారంభమైన తర్వాత ఇచ్చిన అవకాశమే తప్ప మరోసారి రైతులు దరఖాస్తు చేసుకొనేందుకు వీలు కల్పించలేదు. పీఎం కిసాన్ పథకాన్ని ఫిబ్రవరి 1, 2019వరకు పట్టాదారు పాసుబుక్కులు పొందిన రైతులకు వర్తింపజేయగా.. ఆ తర్వాత కొత్తగా పట్టాదారు పాసు బుక్కులు పొందిన రైతులకు ఎలాంటి ప్రయోజనం అందడం లేదు.

**డివిజన్‌లో 5,400 మంది రైతులు**

పట్టాదారు పాసుబుక్కు ఉన్న ప్రతి రైతుకు ప్రతి ఎకరానికి రైతుబంధు పథకం అమలయ్యేలా కేసీఆర్ నిబంధనలు రూపొందించగా, కిసాన్ పథకం ఒక ఇంట్లో ఎంత మందికి పట్టాదారు పాసుబుక్కు ఉన్నా ఒకరికే వర్తించేలా కేంద్రం నిబంధన పెట్టింది. ఇదొక్కటే కాకుండా ఇంకా పీఎం కిసాన్‌కు కోతలు పెట్టేందుకు అనేక కొర్రీల నిబంధనలున్నాయి. వీటికి తోడు కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమే ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తున్నది. డివిజన్‌లో ఫిబ్రవరి 1, 2019 తర్వాత నుంచి ఇప్పటి వరకు కొత్తగా 5,400 మంది భూములు కొనుగోలు చేసి పాసుబుక్కు పొందారు. భూమితో సంబంధం లేకుండా నియమ నిబంధనలకు లోబడి ఉన్న రైతులకు కేంద్రం పెట్టుబడి సాయం కింద ఏటా ప్రతి దఫాకు రూ.2వేల చొప్పున మూడు దఫాలుగా అందిస్తుండగా.. ఇప్పటి వరకు 19దఫాలుగా రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ డబ్బులను కేంద్రం జమచేసింది. డివిజన్‌లో రైతుబంధు(భరోసా) పథకం 56,974మంది రైతులు లబ్ధి పొందుతుండగా, పీఎం కిసాన్ పథకం కేవలం 35,672మంది రైతులకే వర్తిస్తుండడం గమనార్హం.

**పీఎం కిసాన్‌కు కేంద్రం అవకాశమివ్వాలి**



నేను రెండేళ్ల క్రితం 35గుంటల భూమిని గ్రామంలో కొనుగోలు చేశా. రాష్ట్రం పెట్టుబడి కింద ఇచ్చే రైతుబంధు(భరోసా) పథకం డబ్బులు ఖాతాలో జమ అవుతున్నాయి. పీఎం కిసాన్ దరఖాస్తుకు కేంద్రం మరోసారి అవకాశమివ్వాలి. కేసీఆర్ రైతుబంధు మాదిరిగా పీఎం కిసాన్ నిరంతర ప్రక్రియగా కొనసాగించాలి.

*-పుట్టపాక శ్రీకాంత్, ఇప్పల్ నర్సింగాపూర్*

**ప్రతి రైతుకూ వర్తింపజేయాలి**



మా నాయన వారసత్వంగా నాకు గ్రామంలో కొంత వ్యవసాయభూమి సంక్రమించింది. మూడేండ్లు దాటుతున్నా ఇప్పటి వరకు కేంద్రం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వలేదు. రైతుబంధు లెక్క పీఎం కిసాన్ పథకం ప్రతి రైతుకు వర్తింపజేయాలి.

*-ముషం వెంకటేశ్వర్లు, రాంపూర్*